క్లుప్తంగా

విశేష అలంకరణలో సోమేశ్వరస్వామి



మామిడి పండ్ల ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో వేంచేసి యున్న సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానం నందు వైశాఖ పౌర్ణమి శుక్రవారం సందర్భంగా స్వామివారికి మామిడి పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోడే విజయలక్ష్మి, ఆలయ కార్యనిర్వహణాధికారి చాంగటి సురేష్ నాయుడు పర్యవేక్షించగా, ధర్మకర్తలు భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొన్నారు.

ఘనంగా మద్దిరావమ్మ సంబరం



పట్టణంలోని పుర వీధుల గుండా మద్దిరావమ్మ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక మాదివాడలోని మద్దిరావమ్మ, గంగానమ్మ అమ్మవార్ల సంబరం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆడపడుచులు అమ్మవార్లకు గాజులు, చీర, పసుపు కుంకుమలు, బండారి సమర్పించారు. గ్రామం అంతా బండారి చల్లుతూ పాడి పంటలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించారు. పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం రెండెడ్ల బండ్లపై అమ్మవార్ల ప్రభలను ఉంచి పట్టణంలో ఊరేగించారు. పలు శక్తి వేషాలు, గరగ నృత్యాలు, సన్నాయి, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు కొనసాగింది.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోదం



వేసవి వినోదం కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటరమణ

సాక్షి, భీమవరం: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరంలో ఏర్పాటు చేసిన వేసవి వినోదం కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వేసవి వినోదం కార్యక్రమంలో 4 నుంచి 9వ తరగతి వరకు బాలలకు విజ్ఞాన వినోదంతో పాటు చిత్రలేఖనం, గణితం, మ్యాజిక్ వంటి ఎన్నో విజ్ఞాన వినోద కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శి మల్లుల శ్రీనివాస్, బి గోపిమూర్తి, పీఎస్ విజయరామరాజు, ఎకేవీ రామభద్రం, సీహెచ్ పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి



భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అప్పలస్వామి

సాక్షి, భీమవరం: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న ఎక్కువ కేసులను పరిష్కారానికే జాతీయ స్థాయిలో లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు భీమవరం సీనియర్ సివిల్ జడ్జి బి అప్పలస్వామి అన్నారు. శుక్రవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన భీమవరం కోర్టుల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లకు విస్తృత ప్రచారం ఎంతైనా అవసరమన్నారు. భీమవరం కోర్టుల్లో సుమారు 5,524 కేసులు పెండింగ్‌లో ఉండగా 1,200 కేసులను రాజీ చేసేందుకు అవకాశం ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు న్యాయ అవగాహన కార్యక్రమాలు, 10 గ్రామాల్లో పారాలీగల్ వలంటీర్స్ ద్వారా కరపత్రాలు పంపిణీ చేయించామన్నారు.

జాబ్‌మేళాకు 53మంది హాజరు

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం జాబ్‌మేళా కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ వీ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నైకు చెందిన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా నిరుద్యోగ అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పాస్ అయిన విద్యార్థులు సుమారు 53 మంది హాజరయ్యారు.

రోడ్లపై బ్లాక్ స్పాట్లను గుర్తించాలి



రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కృష్ణవేణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు బ్లాక్ స్పాట్లను ఆర్ అండ్‌బి, నేషనల్ హైవే, పంచాయతీరాజ్, మున్సిపల్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్ అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి అవసరమైన పటిష్టమైన రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సమావేశంలో నిర్దేశించిన పనులు ఇంకా పూర్తి కాలేదని వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దీనికి సంబంధించి రవాణా, పోలీస్, జాతీయ రహదారి, ఆర్ అండ్ బి , పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భద్రతపై విస్తృతమైన అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను కళాశాల విద్యార్థులకు, ప్రజలకు వివరించాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు అధికంగా సంభవించే ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్) ను గుర్తించి, జాతీయ రహదారిని కలిపే రోడ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భీమవరం పట్టణంలో పార్కింగ్ ప్లేస్‌ల్లో మాత్రమే ప్రజలు వాహనాలను పార్కింగ్ చేయాలని, వారికి ఇష్టం వచ్చినట్లుగా వాహనాలు పార్కింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె సంబధిత అధికారులకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఏ వి సుబ్బరాజు, జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి టి.ఉమామహేశ్వరరావు, ఆర్‌అండ్‌బి ఈ ఈ ఎస్.లోకేశ్వరరావు, నేషనల్ హైవే డి ఈ యం. శ్రీనివాస రావు, డీఎంఅండ్‌హెచ్‌వో డా డి. మహేశ్వరరావు , భీమవరం ఆర్టీసీ ఆర్ ఎం వీరయ్య చౌదరి, పలువురు జాతీయ రహదారుల అధికారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవుని గ్రామోత్సవం



ఉప్పులూరు చెన్నకేశవస్వామి రథోత్సవంలో పాల్గొన్న క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు

ఉండి: మండలం ఉప్పులూరులో వేంచేసియున్న చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రథోత్సవం కన్నుల పండుగలా నిర్వహించారు.రథంపై ఆశీనులైన శ్రీలక్ష్మీ చూడికుత్తనాచ్చియార్, ఆండాళ్ సమేత చెన్నకేశవస్వామి వార్లను గ్రామంలోని ప్రధాన రహదారుల్లో వందలాది మంది భక్తులు హాజరై రథంపై ఊరేగించారు. ఉప్పులూరు గ్రామంతో పాటు సమీపంలోని పలు గ్రామాల ప్రజలు కార్యక్రమానికి హాజరై రథోత్సవాన్ని తిలకించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు కుమారుడు రాష్ట్ర క్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు(వాసు) హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ పురాతన ఆలయాల్లో ఒకటైన చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాల్లో పాల్గొనడం తనకు లభించిన భాగ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యర్రా వెంటకసుబ్బారావు,ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నిమ్మల సత్యనారాయణ,గంగ్రాజు రాజేష్,గుండాబత్తుల సుబ్బారావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు నిమ్మల శేషగిరి,యర్రా చెన్నకేశవరావు,వందరపు పద్మావతి,యర్రా మంగతాయారు,వడ్లమన్నాడ సాయిపార్వతి,రాచర్ల సీత,కౌణతం కృష్ణమూర్తిదాస్,గ్రామ పెద్దలు,అర్చకస్వాములు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్ జీవితం నేటి తరానికి ఆదర్శం



సీపీఎం ఆధ్వర్యంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



సీపీఐ ఆధ్వర్యంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: సమాజంలో దోపిడీ ఆర్థిక అసమానతలు అంతానికి సోషలిస్టు సమాజ స్థాపనకు కారల్ మార్క్స్ చేసిన కృషి ప్రశంసనీయమని సీపీఐ జిల్లాకార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. శుక్రవారం భీమవరంలో సీపీఐ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు ఉద్యమ పితామహుడు కారల్ మార్క్స్ 205వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మార్క్స్ చిత్రపటానికి పూలమాల ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భీమారావు మాట్లాడుతూ శ్రమజీవుల శ్రమకు తగిన వేతనం ఇవ్వకుండా పెట్టుబడిదారీవర్గం చేస్తున్న శ్రమదోపిడీకి వ్యతిరేకంగా మార్క్స్ రచనలు కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతగానో దోహదం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● సీపీఎం ఆధ్వర్యంలో..... స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి బి బలరామ్ మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంత కర్త, పీడిత ప్రజల విముక్తి కోసం శ్రమించిన కారల్ మార్క్స్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ముందుగా మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జెఎన్వి గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, బి వాసుదేవరావు, పివీ ప్రతాప్, జుత్తిగ నర్సింహమూర్తి, ఎం వైకుంఠరావు, ఏ అజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుకలు అందిస్తాం



కోపల్లె స్కూల్లో జగనన్న విద్యా కానుక స్టాక్ ను పరిశీలిస్తున్న డీఈవో రమణ

కాళ్ల: విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుకలు అందిజేస్తామని డీఈవో ఆర్ వెంకటరమణ తెలిపారు. కాళ్ల మండలంలో డీఈవో శుక్రవారం పర్యటించారు. మండలంలోని కోపల్లే హైస్కూల్లో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక పుస్తకాలు, షూస్ యూనిఫామ్ వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన స్టాక్‌ను నాణ్యతను పరిశీలించారు. దిగుమతి అవుతున్న స్టాక్ ను ఎప్పటికప్పుడు పరిశీలించి పాఠశాల వారీగా ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశారు. వీరి వెంట ఎంఈఓ రవీంద్ర, సీఆర్పీ లు వెంకన్న బాబు, బాలాజీ, మోహన్ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు



విద్యుత్ స్తంభాలకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ కనబరచడం జరుగుతుందని రాయకుదురు సర్పంచ్ గడ్డం భారతి తెలిపారు. రాయకుదురులో వీధిలైట్లు స్తంభాల విస్తరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమం పెద్ద ఎత్తున కొనసాగుతుందన్నారు. రూ.6.36 లక్షల నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి శివన్నారాయణ, లైన్‌మెన్ మధు, సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంకన్న రథోత్సవం



కాళ్లకూరులో వెంకన్న రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందా.. గోవిందా.. అంటూ గోవింద నామస్మరణతో కాళ్లకూరు గ్రామం మారుమ్రోగింది. కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథయాత్ర శోభాయమానంగా జరిగింది. వేద మంత్రాల నడుమ వివిధ మేళతాళాలతో సుందరంగా అలంకరించిన రథంపై స్వామివారు ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత రథంపై ఆసీనులైన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే రామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాతపాటి శ్రీనివాసరాజు డీఎన్నార్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గోకరాజు నరసింహారాజు,గ్రామ పెద్దలు రథాన్ని లాగి ప్రారంభించారు. ఈ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు రథాన్ని లాగేందుకు ఆసక్తి కనబరచడంతో కాళ్లకూరు వీధులన్నీ జనసంద్రంగా మారాయి. సాయంత్రం రథోత్సవం సందర్భంగా జువ్వలపాలెం రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు కాళ్ల పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, గాదిరాజు లచ్చిరాజు, మంతెన పెదనరసింహరాజు, పెన్మెత్స సోమరాజు, వేగేశ్న విజయరామరాజు, బ్యాంకు రాము, అడ్డాల రాము, అడ్డాల నాగరాజు, తోటకూర రవి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



వెంకన్న రథోత్సవంలో తీన్‌మార్ డప్పుల వాయిద్యాలు



రథోత్సవంలో ఏర్పాటు చేసిన శక్తి వేషాలు

నేడు ఆరేడులో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: మండలం ఆరేడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలమూరి కృష్ణ తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

వైభవోపేతంగా పాండురంగ స్వామి ఆలయ ప్రతిష్ఠ



స్వామివారికి వెండి కంచం బహుకరిస్తున్న దాతలు

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో పాండురంగ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు, దాతలు కమిటీగా ఏర్పడి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. ఏలూరుపాడు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్రి వెంకటరాజు, అంజమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు స్వామివారికి రూ.60 వేల విలువ చేసే వెండి కంచెంను స్వామి వారికి బహూకరించారు. అనంతరం అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

7న రాజమహేంద్రవరంలో ఐఏఎల్ రాష్ట్ర మహాసభలు

సాక్షి, భీమవరం: న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం భారత న్యాయవాదుల సంఘం(ఐఏఎల్) 11వ రాష్ట్ర మహాసభలు ఈనెల 7వ తేదిన రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల అధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, సంక్షేమ నిధుల పెంపు, జూనియర్ న్యాయవాదులకు ఉపకారవేతనం పెంపు వంటి సమస్యలపై చర్చిస్తారన్నారు. మహాసభలకు న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని రంగారావు కోరారు.

సర్వే రిపోర్టులను కచ్చితత్వంతో నిక్షిప్తం చేయాలి

భీమవరం అర్బన్: గ్రామ సచివాలయాల పరిధిలో చేస్తున్న సర్వేలు, లబ్దిదారుల డేటాలు కచ్చితత్వంతో కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జునరావు ఆదేశించారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పన్నులు, గ్రామ స్థాయిలో జరుగుతున్న సర్వేలు, మంచినీటి సరఫరా, తదితర వాటిపై డీపీవో మల్లిఖార్జునరావు చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రామచంద్ర ప్రభు, ఈవోపీఆర్‌డీ ఇన్‌ఛార్జి కొండలరావు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భీమవరంలో యూటీఎఫ్ శిక్షణా తరగతులు



భీమవరంలో యూటీఎఫ్ ఉద్యమ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

సాక్షి, భీమవరం: బోధన సిబ్బందిని ప్రమోషన్స్ ద్వారా నియమించాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. భీమవరం యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయులకు నిర్వహించిన ఉద్యమ శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, కేఎస్‌సిహెచ్ సాయిరామ్, బి గోపీమూర్తి, కేవీ రామభద్రం, జీవీ రామానుజరావు, పి క్రాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న మినీగోకులం షెడ్లకు బిల్లులు

భీమవరం అర్బన్: 2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మినీ గోకులం షెడ్లకు బిల్లులకు మంజూరుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని మండల పశు వైద్యాధికారి పి. పుండరీబాబు శుక్రవారం తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో మండలంలో పశు సంవర్థక, డ్వామా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 72 మినీ గోకులం షెడ్లుకు పశు పెంపకం దారులు నిర్మాణాలు చేపట్టారు. పూర్తయిన షెడ్లకు రూ. కోటి 8 లక్షలు ఇవ్వాల్సి ఉండగా గత టీడీపీ ప్రభుత్వం రూ. 40లక్షలు మంజూరు చేసి మిగిలిన పెండింగ్‌లో ఉంచింది. ఇటీవల మిగిలిన షెడ్ల నిర్మాణాలకు సంబంధించి ఈ నెలాఖరులోపు పశు వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి కొలతలు తీసుకుని తగిన నగదును మంజూరుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు మండల పశు వైద్యాధికారి పుండరీబాబు తెలిపారు.

ప్రతిభ కలిగిన విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

భీమవరం (ప్రకాశంచౌక్): అన్ని తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించి సివిల్స్ శిక్షణకు వెళుతున్న నూర్ని షా ప్రతిభకు, ఆమె శిక్షణకు శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో రూ. 50 వేలు ఆర్థిక సహకారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి నౌషాద్, చెరుకువాడ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విస్సాకోడేరులో ఫ్యామిలీ ఫిజీషియన్

పాలకోడేరు: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విస్సాకోడేరు, వంకాయలపాలెంలో బీసీ కమ్యునిటీ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వి.ప్రసాద్ సందర్శించి రోగులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఆయన పర్యవేక్షణలో సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి తగిన సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్‌వీ రంగమనాయుడు, 104 వైద్యురాలు లీలాలక్ష్మి, రమేష్‌రెడ్డి, కె.ఎ శ్రీనివాస్, వై.గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు గీతామందిర నిర్మాణానికి శంకుస్థాపన

ఉండి: మండలంలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గీతామందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు కార్యక్రమం ఆర్గనైజర్ సన్నిధిరాజు చలపతిరావు తెలిపారు.తమ్మినాన రామన్న, మహంకాళమ్మ కుటుంబీకులచే నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు హాజరై శంఖుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు.

కోట సత్తెమ్మకు జలాభిషేకం

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెంలో వెలసిన కోట సత్తెమ్మ అమ్మవారి 21వ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం దొడ్డిపట్ల వశిష్ట గోదావరి నుంచి 108 ముత్తయిదువలు 108 కలశములతో గోదావరి పుణ్య జలాలను తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. గోదావరి నుంచి ఆలయానికి వచ్చే వరకు కలశలతో వస్తున్న ముత్తయిదువలకు చీరలు పరచి వాటిపై నడిపించుకుంటూ గోదావరి జలాలను ఆలయానికి తీసుకువచ్చారు. గోదావరి జలాలతో అమ్మవారికి అభిషేకం చేసిన అనంతరం సామూహిక కుంకుమ పూజలు చేశారు. పూజ అనంతరం మహిళ భక్తులకు అమ్మవారికి పూజ చేసిన పసుపు, కుంకుమ, గాజులను అందజేశారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి

నరసాపురం: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని త్రిదిండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామీజీ సూచించారు. పట్టణంలోని ప్రసిద్ధ ఆదికేశవ ఎంబేరుమానార్ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామచంద్ర రామానుజ స్వామీజీ శుక్రవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఎంబేరుమానార్ కోవెల విశిష్టతను వివరించారు. అనంతరం పుప్పాల వెంకటకృష్ణమోహన్ రాసిన అభినవ భూతపురి వైభవం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

త్వరలో ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతి త్వరలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి శుక్రవారం తెలిపారు. బీఎస్సీ గ్రూప్ ఎంపీసీ, ఎంపీసీఎస్ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్), ఎంసీసీఎస్ (మ్యాథ్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్), ఎంఎస్‌డిఎస్ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, డేటా సైన్స్), బీజెడ్‌సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ), హెచ్‌బీసీ (హార్టికల్చర్, బోటనీ, కెమిస్ట్రీ), ఏటీజెడ్‌సీ (ఆక్వా కల్చర్ టెక్నాలజీ, జువాలజీ, కెమిస్ట్రీ) విభాగాలు ఉన్నాయన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వీరవాసరం: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మిక సంఘం వీరవాసరం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఏపీ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వీరవాసరం మండల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి మల్లుల ఏసుబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులతో సంవత్సరాల తరబడి పనులు చేయించుకోవడం తప్ప వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కానీ, పంచాయతీ అధికారులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని అన్నారు. పంచాయతీ కార్మికులు పోరాడి సాధించుకున్న జీవోలను అమలు చేసి సమస్యలు పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారావు, సిలువు, ప్రభాకర్ రావు, శ్రీను, ఉదార రావు, రాము, వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేసవి వినోదాలను సద్వినియోగం చేసుకోండి

పాలకోడేరు: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు వేసవి వినోదం వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్. వెంకటరమణలు అన్నారు. పాలకోడేరు యూటీఎఫ్ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి వినోదం కార్యక్రమాన్ని డీఈవో ఆర్. వెంకట రమణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే చదువు, క్రీడలతోపాటు సృజనాత్మక ఆలోచనలు పెరిగే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి. గోపీమూర్తి, అధ్యక్షుడు పీఎస్. విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఏకేవీ. రామభద్రం పాల్గొన్నారు.